
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 21 । జూలై । 2023





## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1516 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 800 క్యూసెక్కులు విడుదల చేశారు.



## మాతృమరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్ : డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ అధ్యక్షతన మాతృమరణాలపై సమీక్ష జరిగింది.



## దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో ఎంప్లాయిూస్ గ్రీవెన్స్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన సమావేశం హాలులో శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంప్లాయిూస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు హాజరై వారి ఉద్యోగ సంబంధిత సమస్యలను తెలియచేసి పరిష్కారం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా అధికారులు అందరూ తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

### నేడు ఆర్టీసీ ఎంప్లాయిూస్ గ్రీవెన్స్

నరసరావుపేట: జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిూస్ గ్రీవెన్స్‌డే ను డిపోలోని ప్రజా రవాణాధికారి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు రవాణాధికారి ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఉద్యోగులు ఆన్‌లైన్ లేదా వ్యక్తిగతంగా హాజరై దరఖాస్తు సమర్పించాలని కోరారు.

### సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ కుడికాలువకు గురువారం రాత్రి నీరు విడుదల చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టీఎంసీలు వదలనున్నారు. గంటకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున రాత్రి 10 గంటల వరకు నీటి విడుదలను 5వేల క్యూసెక్కులకు పెంచనున్నారు. 10 రోజుల పాటు ఇదే మోతాదులో నీరు విడుదల చేయనున్నట్లు సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 517.50 అడుగులు ఉండగా 144.7570 టీఎంసీలకు సమానం, గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు. 312.5050 టీఎంసీలకు సమానం.

### రేపు మీడియా వర్క్‌షాప్


నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈనెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఏ-1 కన్వెన్షన్ గ్రాండ్ హాలులో విజయవాడ ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో వార్తాలాప్ మీడియా వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ దీప్తి గురువారం తెలియజేశారు. ముఖ్యఅతిథిగా పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, అతిథులుగా ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ హెచ్‌వోడీ, ప్రొఫెసర్ జి.అనిత హాజరవుతారని పేర్కొన్నారు.

### యార్డులో 34,357 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,838 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,357 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.15,500 నుంచి రూ.24,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,202 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,400, గరిష్ఠ ధర రూ.2,100, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.

# సురక్షితం సుభిక్షం

- 'జగనన్న సురక్ష'కు విశేష స్పందన
- జిల్లాలో 4,36,067 ఇళ్లలో సర్వే పూర్తి
- ప్రజల ముంగిళ్లలోకే 78,107 సేవలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

## సంక్షేమ పాలన విప్లవాత్మకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సురక్షితం, సుభిక్షమని, ఆయన ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశ చరిత్రలో నిలిచే కార్యక్రమమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 10 వేలకుపైగా శిబిరాల నిర్వహణ పూర్తయి, ప్రజల మన్ననలు పొందుతున్న నేపథ్యంలో నరసరావుపేట మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో జిల్లాలోని ప్రజాప్రతినిధులతో కలిసి పిన్నెల్లి మీడియా సమావేశం నిర్వహించారు. పిన్నెల్లి మాట్లాడుతూ.. దేశ చరిత్రలో గతంలో ఏ పార్టీ, ఏ సీఎం ఇన్ని కోట్ల మందికి నిష్పక్షపాతంగా సంతృప్తికరస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. అయినా ఏదైనా కారణం చేత ఏ ఒక్క అర్హుడు ప్రభుత్వ లబ్ధిని పొందలేకపోతే వారికి కూడా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. అందులో భాగంగానే జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు ఇంటి ముంగిటికే తీసుకెళ్లి ఇవ్వడంతోపాటు జల్లెడపట్టి సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. జూన్ 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తే, జూలై 1 నుంచి సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇలా ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 538 సచివాలయాల పరిధిలో 10,768 మంది వలంటీర్లు 4,36,065 ఇళ్లకు వెళ్లి అవసరమైన సేవల గురించి సర్వే చేశారని తెలిపారు. వలంటీర్లు 92,519 మందికి సురక్ష టోకెన్లను జారీ చేయగా అందులో ఇప్పటికే 78,107 సేవలు ప్రజలకు అందాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 57.37 లక్షల సేవలు సురక్ష ద్వారా ప్రజలకు అందాయని వివరించారు. ఫలితంగా ప్రతి గడపలో సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్ మాట్లాడారు.

### గాంధీజీ కలలు సాకారం

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో సాకారమైంది. ప్రభుత్వ సేవలు గ్రామగ్రామాన అందుబాటులోకి వచ్చాయి. మంచి ఆలోచనతో ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం ప్రజల మన్ననలు పొందుతోంది. వివక్ష లేకుండా అందరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

– జంగా కృష్ణమూర్తి, శాసనమండలి విప్

### ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలు



గతంలో ఎవరూ చేయని పాలనను జగనన్న అందిస్తున్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. కళాశాలలు ప్రారంభమైన సమయంలో జగనన్న సురక్ష ద్వారా విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే అందుతున్నాయి.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ

### 92 శాతం మందికి లబ్ధి

గతంలో టీడీపీ నేతలకు నచ్చిన వారికే రేషన్ కార్డులు అందేవి. జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి వారంలోపే రేషన్‌కార్డుతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలు అందేలా చూస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 51 శాతం మంది ఓట్లు వేస్తే ఈ ప్రభుత్వం 92 శాతం మందికి సంక్షేమ లబ్ధిని చేకూర్చింది. అంతటితో ఆగకుండా మిగిలిన 8 శాతం మంది కూడా ఎందుకు దూరమవుతున్నారో సర్వే చేస్తున్న ప్రభుత్వమిది.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే

### ధైర్యంగా ఓట్లు అడుగుతాం



గతంలో ఏ పత్రం కావాలన్నా లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జన్మభూమి కమిటీల సభ్యులు కులం, పార్టీ అడిగి వారికి నచ్చితేనే ధ్రువపత్రాలు జారీ చేసేవారు. ఈ ప్రభుత్వంలో ఇంటి ముంగిటికే రూపాయి కూడా ఖర్చు లేకుండా వలంటీర్ల ద్వారా వేగంగా ధ్రువపత్రాలు అందజేస్తున్నాం. మరో 5, 10 ఏళ్లలో దేశ వ్యాప్తంగా ఏపీ స్ఫూర్తితో వలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పవన్ చిల్లర విమర్శలు చేసి వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న, వలంటీర్ల వ్యవస్థ కావాలంటే మాకు ఓటేయండి అని ప్రజలను ధైర్యంగా అడుగుతాం.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల ఎమ్మెల్యే

### గతంలో ఒకరు చనిపోతేనే మరొకరికి పింఛన్



గత ప్రభుత్వ హయాంలో ఒక పింఛన్‌దారుడు చనిపోతేనే ఆ పంచాయతీలో మరో పింఛన్ ఇచ్చేవారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన వారు ఎవరి చుట్టూ తిరగకుండానే ఇంటి వద్దకే వచ్చి అన్ని పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారు. గొప్ప మనసున్న జగనన్న పాలనలో సురక్ష కార్యక్రమం ద్వారా జల్లెడ పట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. దీనిపై ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. గడప గడపలో ప్రజలు జగన్‌కు జై కొడుతున్నారు.

– నంబూరు శంకరరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే

### టీడీపీ వాళ్లూ మెచ్చేలా పాలన

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివక్షలేకుండా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తుండటంతో టీడీపీ వాళ్లు సైతం చేతులు జోడించి నమస్కరించి కృతజ్ఞతలు చెబుతున్నారు. దమ్మున్న నాయకుడు జగనన్న నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు. దీన్ని చూడలేని చంద్రబాబు, జీవీ ఆంజనేయులు లాంటి వారు అసత్య ఆరోపణలు చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో నేను రూ.53 కోట్ల రుణం తీసుకున్నట్టు పచ్చ చానళ్లు ప్రచారం చేశాయి. నాకు, నా కుటుంబ సభ్యులకు ఆ బ్యాంక్‌లో రుణం కాదు కదా కనీసం అకౌంట్ ఉన్నట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసురుతున్నాను.

– బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ ఎమ్మెల్యే

## సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: సీఆర్డీఏ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణాలకు ఈనెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన పైలాన్, మోడల్ హౌస్ నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాటు పనులను కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి లాంఛనంగా శంకుస్థాపన చేయనున్న ప్లాట్ వద్ద, వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే ప్రాంతంలో లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేయాల్సిన సభా వేదిక, వీవీఐపీ వాహనాల పార్కింగ్, ప్రజల వాహనాల పార్కింగ్ వద్ద చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటపాలెంలో బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులు, బహిరంగ సభా ప్రాంగణంలో వేదిక, గ్యాలరీల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ శివరామకృష్ణ, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీ సీఈవో మోహనరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, భూగర్భ జల వనరుల శాఖ ఉప సంచాలకులు వందనం, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాస మూర్తి, ఉద్యాన శాఖాధికారి రవీంద్ర, వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# నకిలీ, కల్తీలపై ఉక్కుపాదం

- ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం
- ఆ దిశగా విజిలెన్స్ కృషి
- రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వరరావు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లాలో నకిలీ, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, బయో ఉత్పత్తుల అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నామని రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు స్పష్టం చేశారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అవసరమైతే క్రిమినల్ కేసుల నమోదుకూ వెనుకాడబోమని వివరించారు. సబ్సిడీ పథకాల్లో అవకతవకలకు పాల్పడినా సహించబోమని వెల్లడించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్ట చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరరావు బుధవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

**రైతులు నష్టపోకూడదని..**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏ ఒక్క రైతూ నకిలీ, కల్తీ విత్తనాలు, పురుగుమందుల వల్ల నష్టపోకూడదని కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నాం. నకిలీ, కల్తీ సరుకుల అమ్మకందారులను గుర్తించి కట్టడి చేసేందుకు జల్లెడ పడుతున్నాం. ముఖ్యంగా ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి నకిలీ, కల్తీ ఎరువులు, విత్తనాలు సరఫరా అవుతున్నట్టు గుర్తించాం. ఇటీవల పార్శిల్ కార్యాలయాల్లో అనుమతుల్లేని రూ.1.68 లక్షల విలువైన 200 లీటర్ల పురుగు మందులు, 280 పత్తి విత్తనాలు సీజ్ చేశాం.

**డీలర్లకు అవగాహన కల్పిస్తున్నాం**

కంపెనీల బ్రాండ్ల ముసుగులో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మార్కెట్లో చలామణి అవుతున్నాయి. దీనిపై ఇటీవల గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని డీలర్లకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాం. త్వరలో బాపట్ల జిల్లాలోనూ నిర్వహిస్తాం. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎమ్మార్పీ ధరలకు పంట ఉత్పాదకాలు అమ్మాలని డీలర్లను ఆదేశించాం. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నలుగురి డీలర్లపై కేసులు నమోదు చేశాం. గడ్డి మందుపై నిషేధం ఉంది. విక్రయాలు జరిపితే కేసులు తప్పవు. ఇటీవల క్రోసూరు మండలంలోనరి సుబ్రమణ్యం ట్రేడర్, లక్ష్మీ శ్రీనివాస పెస్టిసైడ్ దుకాణాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. 30 లీటర్ల గడ్డి మందు సీజ్ చేశాం.

**పీడీఎస్ సరుకులపై ప్రత్యేక నిఘా**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యం (పీడీఎస్), సబ్సిడీ కందిపప్పు, వంట నూనెల విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించాం. పంపిణీలో అవకతవకలను సహించం. ఇటీవల గుంటూరులో పది రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాం. నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాం. ఆర్టీసీ కాలనీలోని భార్గవ రైస్ మిల్‌పై కేసు నమోదైంది. ఆహార పదార్థాలు, వంటనూనెలు, శీతల పానీయాల కల్తీపైనా నిఘా పెట్టాం. ధరలపైనా దృష్టిపెట్టాం.

**నకిలీ సిగరెట్లపై 'లోతు'గా విచారణ..**

ఇటీవల చిలకలూరిపేటలో పట్టుబడిన నకిలీ సిగరెట్ల వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేస్తున్నాం. ఐటీసీ కంపెనీ పేరుతో నకిలీ సిగరెట్లు పట్టుబడటం ఏపీలో ప్రథమం. ఈ వ్యవహారంలో పట్టుబడిన వరగానివాసి సుధాకర్‌పై గతంలో గుట్కాతోపాటు ఐదు కేసులున్నాయి. అతనికి తెలంగాణలోని ఓ జిల్లా నుంచి నకిలీ సిగరెట్లు సరఫరా అయినట్లు గుర్తించాం.

**అక్రమాలపై కాల్ చేయండి**

నేను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 18 చోట్ల తనిఖీలు నిర్వహించాం. 16 కేసులు నమోదు చేశాం. అక్రమాలపై సమాచారం తెలిస్తే ప్రజలు ఎప్పుడైనా ఫోన్ చేయొచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ఫిర్యాదులకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
**80082 03288**

## సమాజ నిర్మాణంలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

రీజినల్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ సుబ్బారావు



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

బాపట్ల అర్బన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.సుబ్బారావు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష (సీమ్యాట్ ) ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు బాపట్లలోని విస్తరణ కేంద్రంలో నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న ప్రాంతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్జేడీ గురువారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. చిత్తశుద్ధితో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాలలను పర్యవేక్షించే ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 23వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. డిజిటల్ విద్య కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ప్రాథమిక స్థాయిలో స్మార్ట్ టీవీలు, 6 నుంచి ఆపై తరగతుల్లోని ప్రతి తరగతి గదిలో 32 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు ఈనెల 30వ తేదీలోగా ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. ప్రైమరీ టీచర్లకు 60 రోజుల కోర్సు అందించనున్నట్లు వెల్లడించారు. విద్యాభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి వీరభద్రరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ పాలన విప్లవాత్మకం

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, చిత్రంలో పార్టీ నేతలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఆలోచన విధానాలు విప్లవాత్మకమని, ప్రతి ఒక్క పథకం ఒక మైలురాయి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. వారికి మరింత సేవలు అందించే దిశగా జగనన్న సురక్ష కార్యక్రమానికి నాంది పలికారని పేర్కొన్నారు. జూలై 1 నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ప్రజలకు వద్దకే పాలకులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు వెళ్లి అందజేస్తున్న పరిస్థితి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏనాడూ లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 429 శిబిరాలు నిర్వహించగా, 5,46,538 నివాసాలను వలంటీర్లు సర్వే చేశారని పేర్కొన్నారు. తద్వారా ప్రజల నుంచి మొత్తం 1,95,914 అభ్యర్థనలు స్వీకరించగా, 1,81,595 ఆమోదించినట్లు వివరించారు. మిగతా దరఖాస్తులు కూడా కొద్ది రోజుల వ్యవధిలోనే పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. వలంటీర్లు ఇటువంటి మంచి సేవలు అందిస్తున్నా.. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారిపై విషం చిమ్మటం సిగ్గుచేటన్నారు. దీనిని యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని వరప్రసాద్ పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ చెప్పారంటే.. చేస్తారంతే అన్న పేరును నిరూపించుకున్నారన్నారు. అనంతరం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణను దుశ్శాలువా, పూలమాలతో వరప్రసాద్ సత్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు కొప్పుల విజయమాధవి, సీడీ భగవాన్, గనిక ఝాన్సీరాణి, అత్తోట జోసఫ్, నర్గీస్, పెరికల కృష్ణ మోహన్, ఆవుల సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సంతోషించే నేత

- నేడు వైఎస్సార్ నేతన్న నేస్తం జమ
- భట్టిప్రోలు మండలం ఐలవరంలో బాపట్ల జిల్లాస్థాయి కార్యక్రమం
- 8,705 కుటుంబాలకు మేలు
- రూ.20.89 కోట్ల మేర లబ్ధి
- జగనన్నకు రుణపడి ఉంటామని లబ్ధిదారుల ఆనందం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరి వేదికగా బటన్ నొక్కి నేరుగా నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. బాపట్ల జిల్లాస్థాయి కార్యక్రమాన్ని భట్టిప్రోలు మండలం ఐలవరంలో అధికారులు నిర్వహించనున్నారు. జిల్లాలో 8,705 మందికి రూ.20.89 కోట్ల మేర ప్రయోజనం కలగనుంది.

– భట్టిప్రోలు



సంక్షేమ రాట్నం: వడుకుతున్న కార్మికురాలు

### జవసత్వాలు నింపిన జగనన్న



చేనేత రంగం సమీకృత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో ప్రణాళికలను సిద్ధం చేయడం ఆనందదాయకం. చేనేత రంగం దాదాపు అవసానదశకు చేరిన తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల్లో జవసత్వాలు నింపారు. నేతన్న నేస్తం పథకం ఆసరాగా నిలుస్తోంది.

– కౌతరపు వెంకటేశ్వరరావు, ఐలవరం

### ఆనందదాయకం



చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో తీసుకున్న ఈ నిర్ణయం భేష్. చేనేత మగ్గం నేయడంతో 50 ఏళ్లకే చూపు మందగిస్తోంది. కుటుంబ పోషణకు వేస్నీళ్లకు చన్నీళ్లు తోడుగా జగన్ మా కోసం ఏడాదికి రూ.24వేలు అందించడం ఎంతో ఆనందదాయకం.

– కాగిత బాపనయ్య, భట్టిప్రోలు

### సీఎం భరోసా



ఇంటిల్లపాది కష్టపడితేనే మగ్గం ముందుకు కదులుతుంది. అసలే అతంతమాత్రంగా పనులు ఉన్నాయి. చాలీచాలని మజూరీలతో బతుకుబండి నెట్టుకు వస్తున్నాం. మరో వృత్తి తెలియదు. తెలిసిన వృత్తిలోనే జీవనయానం కొనసాగిస్తున్నాం. జగన్ నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం ఎంతో భరోసాను ఇస్తోంది.

– కౌతరపు గణపతి, భట్టిప్రోలు

## తీర ప్రాంతంలో మొక్కల పెంపకంతో ప్రయోజనం

చినగంజాం: తీర ప్రాంతంలో మడ మొక్కలను పెంచడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని డ్వామా పీడీ వై.శంకర్‌నాయక్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ప్రాధాన్యతలో భాగమైన మడ అడవుల పెంపకానికి రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌గా మండలంలోని పల్లెపాలెం గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శంకర్‌నాయక్ గురువారం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. ఫీడర్, ఫీల్డ్ చానల్స్ పరిశీలించిన అనంతరం ఆయన మడ మొక్కలు నాటారు. వీటి వలన కలిగే ప్రయోజనాల గురించి గ్రామస్తులకు వివరించారు. పీడీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు లక్షల మొక్కలు పెంపకంలో భాగంగా సంబంధిత ఇతర శాఖలకు మొక్కలు సకాలంలో నాటడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం ఆయన కడవకుదురు గ్రామ పంచాయతీలో పండ్ల మొక్కల పెంపకంలో భాగంగా పి.హనుమంతరావు అనే రైతు పొలాన్ని పరిశీలించారు.

## క్లుప్తంగా

### సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్

**నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు):** ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్, గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సివిల్స్ సర్వీసెస్‌కు సంబంధించి విశాఖపట్నంలో, గ్రూప్–1కు సంబంధించి విజయవాడలో, గ్రూప్–2కు సంబంధించి తిరుపతిలో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తామన్నారు. దరఖాస్తుదారు కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు దాటకూడదన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీ లోపు హెచ్‌టీటీపీఎస్ ఏపీఎస్‌టీడీసీ ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు సూర్య ఆకాష్



**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** గుంటూరుకు చెందిన పాకాల సూర్య ఆకాష్ ఈ నెల 26 నుంచి 31 వరకు బ్యాంకాక్‌లో జరగనున్న అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికై నట్లు సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ కార్యదర్శి కడియం జయరావు గురువారం తెలిపారు. కోచ్ శివ ఆధ్వర్యంలో తర్ఫీదు పొందిన సూర్య ఆకాష్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### 23న ఉచిత వైద్య శిబిరం

**గుంటూరు మెడికల్ :** ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 23న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతోందన్నారు. చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, దంత వైద్యులు డాక్టర్ ప్రత్యూష రెడ్డి వైద్య శిబిరంలో షుగర్ టెస్టు, ఊపిరితిత్తుల పరీక్ష, గుండె జబ్బు నిర్ధారణ చేసే ఈసీజీ పరీక్ష, బీఎంఐ పరీక్షలు, దంత పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. గుంటూరు వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఏపీ ఎన్జీవో కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని సంఘ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

## నూతన పరిపాలనకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

**నిజాంపట్నం:** భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టనటువంటి నూతన పరిపాలనా వ్యవస్థకు శ్రీకారం చుట్టిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని అడవులదీవిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఇప్పటి వరకూ అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని అయితే ఆ పథకాలలో అర్హత ఉండి పథకాలు లభించని వ్యక్తులను గుర్తించి సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. చదువుకునే విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి 13 రకాల ధ్రువపత్రాలను ఈ కార్యక్రమం ద్వారా వెంటనే అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 61,16,811 సర్టిఫికెట్‌లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించినట్లు తెలిపారు.

కులం, మతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి లక్షల్లో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. ఇంత పరిపాలన చేస్తున్నారు కాబట్టే జాతీయస్థాయిలో సంక్షేమ రథసారధిగా, ఉత్తమ ముఖ్యమంత్రిగా గుర్తింపు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొందుతున్నారంటే ఆ గౌరవం, ఆ ఖ్యాతి ఆంధ్ర రాష్ట్ర పౌరులకు లభిస్తుందని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి

**వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక**

అడవులదీవి పంచాయతీ పరిధిలోని రామకృష్ణపురంలో టీడీపీ నుంచి పెనుమూడి నరేష్‌తోపాటు పలు కుటుంబాలు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. గరువు గ్రామంలో శరత్ ఎంపీ మోపిదేవి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

మోపిదేవి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా తయారీపై సర్వే

రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

**నరసరావుపేట:** ఓటర్ల జాబితా తయారీపై వివరాల సేకరణకు శుక్రవారం నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయములోని బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులపై జిల్లాలోని వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌స్టేషన్ రేషనలైజేషన్ ప్రక్రియ వంటివి ఆగస్టు 22 నుంచి 29 వరకు నిర్వహిస్తారన్నారు. సప్లిమెంట్ తయారీ సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16వరకు, 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తారన్నారు. క్లెయిముల ఫైలింగ్, అభ్యంతరాలకై అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకు, ప్రత్యేక క్యాంపెయిన్‌లు ఆగస్టు 28, 29 తేదీలు, సెప్టెంబరు 18, 19వ తేదీన ఉంటాయన్నారు. డిసెంబరు 26న క్లెయిముల డిస్పోజల్, అభ్యంతరాలు, డేటాబేస్ అప్డేషన్, ప్రింటింగ్ ఆఫ్ సప్లిమెంట్ జనవరి ఒకటో తేదీన, తుది ఓటర్ల జాబితా ప్రచురణ జనవరి ఐదున నిర్వహిస్తామని తెలిపారు. వలస ఓటర్ల విషయంలో వారు తాత్కాలికంగా వలస వెళ్లారా, శాశ్వతంగా వెళ్లారా వివరాలు తెలుసుకొని ఓటర్ల జాబితాలో సవరణలు చేయాలన్నారు. అదేవిధంగా భార్యాభర్తలకు వేర్వేరు పోలింగ్ కేంద్రాలలో ఓటు ఉన్నట్లయితే వారి అభ్యర్థన మేరకు ఒకే దగ్గర ఓటు హక్కు వినియోగించుకునేలా సవరణలు సంబంధిత ఈఆర్‌ఓల సహకారంతో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించి ఆయా ఇద్దరు ఈఆర్వోలు పరస్పరం చర్చించుకుని అభ్యర్థి అభ్యర్థన మేరకు ఒకచోట ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయపార్టీల అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయపార్టీలు బూతుల వారీగా బూత్ లెవెల్ ఏజంట్‌లను నియమించి ఓటరు లిస్టు సవరణలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి ఓటరు జాబితాలను సంబంధిత సచివాలయాలు, పంచాయతి కార్యాలయాల్లో ఉంచుతామని తెలిపారు. తొలగించిన ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారులు, ఆర్డీవోలు రాజకుమారి, శేషిరెడ్డి, అద్దేయ్య, డీఎఫ్‌వో రామచంద్రరావు, వసంతబాబు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, హాజరైన రాజకీయపార్టీల నాయకులు

# వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులు దృష్టిపెట్టాలి

- మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు గ్రహీత, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ
- 550కి పైగా మార్కులు సాధించిన పదోతరగతి ప్రభుత్వ విద్యార్థులకు నగదు బహుమతులు



గీతాంజలి శర్మకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** కేవలం అకడమిక్ పుస్తకాల చదువుతోనే సరిపెట్టకుండా వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. పాఠ్యపుస్తకాలు చదివితే పరీక్షలు బాగా రాయొచ్చనీ, మంచి ఉద్యోగం కూడా తెచ్చుకోవచ్చనీ చెబుతూ వ్యక్తిత్వం వికాసంతో మంచి జీవితాన్ని గడపొచ్చని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఇందుకు ప్రోత్సహించాలని సూచించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు, వితరణశీలి మొవ్వా విజయలక్ష్మి స్మారక ద్వితీయ పురస్కార ప్రదానోత్సవ సభ గురువారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగింది. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు సేవాసమితి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మకు అవార్డును ప్రదానం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో 550 పైగా మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతిని, జ్ఞాపికను అందజేశారు. గీతాంజలి శర్మ 'విద్యార్థులు–భవిష్యత్ సవాళ్లు.. అనే అంశంపై విజయలక్ష్మి స్మారకోపన్యాసం చేశారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఏదొక క్రీడలో సాధన చేయాలని సూచించారు. అందరూ చదువుతున్నారని ఇంజినీరింగ్, డాక్టరు, ఐఏఎస్ కావాలని అనుకోవద్దని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్లోబల్ వార్మింగ్, నీటి కొరత వంటి భవిష్యత్‌కు సంబంధించిన అంశాలకు సిద్ధం కావాలని చెప్పారు. చక్కని విద్య కోసం ఎక్కడికైనా వెళ్లేలా విశాల దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, విజయలక్ష్మి స్మారక సేవాసమితి చేస్తున్న సామాజిక సేవను కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గొప్ప గొప్ప పారిశ్రామికవేత్తలు అంతా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చినవారేనని గుర్తుశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ విధినిర్వహణలో ఉత్తమంగా రాణిస్తున్న గీతాంజలిశర్మకు విజయలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం సముచితమని చెప్పారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, విద్యారంగ ప్రముఖుడు కుదరవల్లి రామమోహనరావు మాట్లాడారు. మొవ్వా రఘుబాబు, గీతిక, పద్మ, అవంతి, కన్యధార తాతాజీ పర్యవేక్షించారు.

## విదేశాలకు వస్తువుల ఎగుమతి చాలా సులభం

- పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి
- డీఎన్‌కే ప్రారంభం



ప్రధాన పోస్టాఫీసులో ఏర్పాటుచేసిన డీఎన్‌కే వద్ద పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి

**నరసరావుపేట:** మనం తయారు చేసిన ఉత్పత్తులు, వస్తువులను ఇతర దేశాలలో వాణిజ్య అవసరాలకు చాలా సులభంగా ఎగుమతి చేసేందుకు భారత తపాలా శాఖ పోస్టాఫీసులలో ఢాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం(డీఎన్‌కే)ను ప్రవేశపెట్టిందని పోస్టాఫీసు సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి పేర్కొన్నారు. ఇటీవలనే ఈ కేంద్రాన్ని నరసరావుపేట డివిజనల్ పోస్టాఫీసులో ఏర్పాటు చేశామన్నారు. పోస్టాఫీసులో గురువారం ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు పోస్టాఫీసు ద్వారా విదేశాలకు వాణిజ్యపరమైన వస్తువులు బుక్ చేసేందుకు పోస్టల్ బిల్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్స్ (పీబీఇ) మాన్యువల్‌గా నియమించబడిన ఫారిన్ పోస్టాఫీసు కౌంటర్లు, అంతర్జాతీయ వ్యాపార కేంద్రాల్లో మాత్రమే వెసులుబాటు ఉండేదన్నారు. ఎగుమతిదారులు వారి ఆర్టికల్స్‌ను భౌతికంగా ఎఫ్‌పీవోలకు తీసుకురావటం, అక్కడ కస్టమ్ ద్వారా పీబీఇ నంబర్ ఇవ్వడం, ఆ తర్వాత బుకింగ్ చేయటం జరుగుతుండేదన్నారు. కస్టమ్ అధికారులు సంతకం చేసిన పీబీఇని ఉపయోగించి ఎగుమతిదారులు టాక్స్ క్లెయిమ్, రిఫండ్ చేసుకునేవారన్నారు. ఇప్పుడా సమస్యలను దూరం చేస్తూ భారత ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రం, ప్రధాన పోస్టాఫీసుల్లో డీఎన్‌కేలను ఏర్పాటుచేసిందన్నారు. తుపాకులు, బాణసంచా, గ్యాస్ సిలిండర్లు, తూటాలు, అగ్గి పుట్టించే వస్తువులు, రేడియాక్టీవ్ మెటీరియల్స్, బ్యాటరీలు లాంటి వస్తువులు డీఎన్‌కేల ద్వారా ఎగుమతికి నిషేధమన్నారు. వినియోగదారులు పీబీఇని ఆన్‌లైన్‌లో వెబ్ లింక్ ద్వారా ఇంటి వద్దనే ఫైల్‌చేసి సమీపంలోని డీఎన్‌కేల ద్వారా వారి ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవచ్చన్నారు. డీఎన్‌కేలలో కస్టమర్‌లకు అందించాల్సిన ప్యాకేజింగ్ సొల్యూషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక విభాగం కూడా స్థాపించారన్నారు. దీని ద్వారా ప్యాకింగ్‌ను క్షేమంగా గమ్యస్థానానికి చేరుతుందన్నారు. ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు హెడ్‌పోస్టాఫీసుల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

## బాలుడిని ఆదుకున్న ఎమ్మెల్యే నంబూరు

సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.10 లక్షల చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**క్రోసూరు:** ప్రాణాపాయస్థితిలో ఉన్న ఏడేళ్ల బాలుడికి ఎమ్మెల్యే నంబూరు శంకరావు అండగా నిలిచారు. క్రోసూరులోని పాతూరు వీధికి చెందిన షేక్ చిన్న సైదా, బీహాజరాల కుమారుడు షేక్ మహమ్మద్ అష్రఫ్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. లివర్ ప్లాంటేషన్ తప్పనిసరి అని వైద్యులు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వలేని పేద కుటుంబం కావటంతో వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గురువారం పార్టీ కార్యాలయం వద్ద కలుసుకుని తమ పరిస్థితి వివరించారు. ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల విలువైన లోన్ ఆఫ్ క్రెడిట్‌ను తల్లిదండ్రులకు అందజేశారు. ఆపదలో అండగా నిలిచిన ఎమ్మెల్యేకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ ఖాదర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన కేరళ వైద్యులు

నివేదికను కేంద్ర వైద్యశాఖకు అందజేస్తాం



హాస్పిటల్ సూపరింటెండెంట్ రంగారావుతో సమావేశమైన కేరళ డాక్టర్లు

**నరసరావుపేట:** స్థానిక లింగంగుంట్ల కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు కేరళ నుంచి వచ్చిన ఇరువురు సభ్యులతో కూడిన పాపులేషన్ రీసెర్చ్ టీం సభ్యులు గురువారం పరిశీలించారు. డాక్టర్ కేఆర్.అనితకుమారి, డాక్టర్ డీఎస్ సబితదాస్ హాస్పిటల్‌కు వచ్చి అందులోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓపీ రికార్డులు, రోగులకు అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. దీనికి సంబంధించిన నివేదికను కేంద్ర వైద్యశాఖకు అందజేస్తామని పేర్కొన్నారు. వారిని సత్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు, డీపీవో వసూర్నారు బాష, స్టాటిస్టికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు, డాక్టర్ నాగపద్మజతోపాటు పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెలలో తక్కువగా నమోదైన వర్షపాతం

రెండు మండలాల్లోనే అధిక వర్షపాతం

**నరసరావుపేట:** ఈనెలలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు వర్షపాతం చాలా తక్కువగా నమోదైంది. మొత్తం 28 మండలాల్లో ఈనెల సాధారణ వర్షపాతం మించి కేవలం రెండు మండలాల్లోనే ఎక్కువ వర్షం కురిసింది. నెల మొత్తంపై జిల్లా వ్యాప్తంగా మొత్తం మండలాల్లో 3,666 మి.మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 20రోజుల వ్యవధిలో 1416 మి.మీ వర్షమే నమోదైంది. ఈపూరులో నెలవారీ సాధారణ వర్షం 85.4 మి.మి వర్షం పడాల్సి ఉండగా 119 మి.మి వర్షం కురిసింది. అచ్చంపేటలో 161.3 మి.మికి 171.6 మి.మి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో పడిన వర్షాన్ని గమనిస్తే..మాచర్లలో 114.1మి.మి–16.4 మి.మి, వెల్దుర్తిలో 104.3–22.8, దుర్గిలో 127.6–30.8, రెంటచింతలలో 127.1–79.8, గురజాలలో 154.3–56.8, దాచేపల్లిలో 135.6–40, కారంపూడిలో 135.4–18.2, పిడుగురాళ్లలో 145.4–32, మాచవరంలో 146.5–42, బెల్లంకొండలో 142.8–71.4, క్రోసూరులో 169.4–78.6, అమరావతిలో 198.6–52, పెదకూరపాడులో 161–69, సత్తెనపల్లిలో 170–63, రాజుపాలెంలో 144.4–58.2, నకరికల్లులో 116.8–20.2, బొల్లాపల్లిలో 106.9–70.8, వినుకొండలో 84.8–37.6, నూజెండ్లలో 89.6–49.2, శావల్యాపురంలో 89.9–50.7, రొంపిచర్లలో 113.9–25.3, నరసరావుపేటలో 126.9–34.4, ముప్పాళ్లలో 165.4–13.8, నాదెండ్లలో 109.5–22.4, చిలకలూరిపేటలో 110.2–42.2, యడ్లపాడులో 128.7 మి.మీటర్లకుగాను కేవలం 28.7 మి.మీటర్ల వర్షమే కురిసింది. వచ్చే నాలుగురోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

## నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఉద్యానశాఖ జిల్లా అధికారిణి జెన్నమ్మ



నర్సరీని తనిఖీ చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు

**అద్దంకి:** నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందేనని ఉద్యానశాఖ జిల్లా అధికారిణి పీ జెన్నమ్మ పేర్కొన్నారు. ఆమె గురువారం స్థానిక ఉద్యానశాఖ అధికారి దీప్తితో కలిసి మండలంలోని శింగరకొండపాలెం, చిన్నకొత్తపల్లి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఊరికే మొక్కలు పెంచి విక్రయించడం కుదరదన్నారు. ప్రతి నర్సరీ యజమాని రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ పొందాలన్నారు. నాణ్యమైన నారును పెంచి రైతులకు విక్రయించాలన్నారు. ఎక్కడైనా నాసిరకం నారును విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొక్కలు విక్రయించినపుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. నర్సరీల్లో మాత్రమే మొక్కలు విక్రయించాలని, విడిగా విక్రయించడానికి వీలు లేదన్నారు. అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో యజమానులు రికార్డులు పరిశీలనకు ఉంచాలని ఆదేశించారు.

## సంఘవిద్రోహ శక్తుల చేతికి యాసిడ్ అందకూడదు

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**బాపట్లటౌన్ :** సంఘ విద్రోహ శక్తుల చేతికి యాసిడ్ అందకూడదనే లక్ష్యంతో కఠిన చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని డీఎస్పీ కార్యాలయాల్లో గురువారం రాత్రి యాసిడ్ విక్రయించే వ్యక్తులు, సరఫరా చేసే వ్యక్తులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ యాసిడ్ సేకరణ, వినియోగం, విక్రయం, నిల్వలకు సంబంధించిన లాగ్ బుక్‌ను సక్రమంగా నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయోగశాలలో, హాస్పిటల్ లాంటి ప్రదేశాల్లో వినియోగించే ప్రమాదకరమైన యాసిడ్‌లు నేరస్తులు, సంఘ విద్రోహ శక్తుల చేతికి చేరితే వాటిని ఉపయోగించి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. పాయిజన్ యాక్ట్ 1958, ఆంధ్రప్రదేశ్ పోసిషన్ అండ్ సేల్ రూల్ 2016 నిబంధనలను అనుసరించి యాసిడ్ కొనుగోలు చేయడం, సేకరించడం, రవాణా చేయడం, నిల్వ చేయడం, వినియోగించడం చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో పలువురు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు

**పాత గుంటూరు:** ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించే కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను గురువారం జిల్లా ప్రజారవాణా అధికారి ఎం. రవికాంత్ గురువారం ప్రారంభించారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రమాదాల నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై, పాటించవలసిన నియమాలు, తొందరపాటు వలన జరిగే అనర్థాలను వివరించారు. డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ జోన్–3 ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత లోపించుట వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్ తన డ్రైవింగ్‌లో తన వెనుక సుమారు 50 మంది ప్రయాణీకుల భద్రత పట్ల తన బాధ్యతను గ్రహించి సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. డ్రైవర్లకు మానసిక విశ్రాంతి ఎంతో అవసరమనీ, రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు–2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం, మెకానికల్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**భవానీపురం:** ఏపీ యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు 2023 సంవత్సరానికి సంబంధించి అర్హులైన వారి నుంచి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డ్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వ్యక్తిగతంగా, సాంఘిక కార్యక్రమాలకు (సోషల్ వర్క్) సంబంధించిన అంశాలు, ఇతర జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారు తగిన ఆధారాలతో (వార్తా పత్రికల క్లిప్పింగులు, ఫొటోలు జతపరచి) దరఖాస్తు చేయాలని వివరించారు. గ్రామ/మురికివాడల అభివృద్ధిలో చేసిన కృషి, స్వచ్ఛంద సేవా సంస్థలు, లాభాపేక్ష లేని సంస్థలకు చెందిన వ్యక్తులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తును ఒక పేజీకి మించకుండా తమ వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఇ–మెయిల్ వివరాలను జత చేసి ముఖ్య కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, యువజన సర్వీసుల శాఖ, స్టెప్– క్రిషి, సబ్ కలెక్టర్ కార్యాలయంపై అంతస్తులో అందజేయాలని ఆయన సూచించారు.